ఉచ్చు.. ఆదమరిస్తే చిచ్చు

- వన్యప్రాణుల వేటకు విద్యుత్ ఉచ్చులు
- అప్రమత్తంగా లేకుంటే ప్రాణాలకే ముప్పు
- వన్యప్రాణులతో పాటు పశువులు మృత్యువాత


గోకవరం మండలంలోని అటవీప్రాంతం


విద్యుత్ ఉచ్చు తగిలి మృతి చెందిన మేక


అటవీ ప్రాంతంలో వన్యప్రాణుల కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ ఉచ్చు

గోకవరం: శీతాకాలం వచ్చిందంటే మైదాన ప్రాంతాల్లో పండించే దుంపలు, పండ్లు, తదితర పంటలను తినేందుకు అడవి పందులు, ఇతర వన్యప్రాణులు పొలాలకు వస్తాయి. వీటిని లక్ష్యంగా చేసుకుని కొందరు వ్యక్తులు విద్యుత్ తీగలతో ఉచ్చులు వేస్తున్నారు. ఈ ఉచ్చుల్లో పడి అనేక వన్యప్రాణులు బలవుతుండగా, ఒక్కోసారి ప్రజలు మత్యువాత పడుతున్నారు. మెట్ట ప్రాంతమైన జగ్గంపేట, గోకవరం, రౌతులపూడి మండలాల్లో అటవీ ప్రాంతం ఉంది. జగ్గంపేట నియోజకవర్గంలో ఫోక్సుపేట, ఇందుకూరు రేంజి పరిధిలో లక్షలాది ఎకరాల్లో అటవీప్రాంతం విస్తరించి ఉంది. ఈ అటవీ ప్రాంతంలో జింక, దుప్పి, కణుజు, అడవి పందులు తదితర వన్యప్రాణులు ఉన్నాయి. ప్రస్తుతం శీతాకాలం కావడంతో విద్యుత్ ఉచ్చులతో వేటకు పాల్పడుతున్నారు. గోకవరం మండలంలో మల్లవరం, తిరుమలాయపాలెం, గంగంపాలెం, రంపయర్రంపాలెం గ్రామాల్లో జగ్గంపేట మండలంలో నరేంద్రపట్నం, బావారం, గోవిందపురం, మల్లిసాల గ్రామాల్లో, రౌతులపూడి మండలంలో ఎస్ఎస్ పట్నం, లచ్చిరెడ్డిపాలెం, ఎస్.అగ్రహారం గ్రామాల్లో ఎక్కువగా ఉచ్చులతో వన్యప్రాణుల వేట జరుగుతోంది.

ప్రాణాలు బలి

దుంప తోటల సాగు ఎక్కువగా జరిగే ప్రాంతాల్లో అడవి పందులు దుంపలను తినేందుకు తోటల్లోకి వస్తుంటాయి. వీటి మాంసం కోసం వేటగాళ్లు విద్యుత్ ఉచ్చులు ఏర్పాటు చేస్తుంటారు. ఇవి కంటికి కనిపించవు. అటవీ ప్రాంతం, మైదాన ప్రాంతాలకు అనుకుని ఏర్పాటు చేసే ఈ ఉచ్చులో పడి వన్యప్రాణులు ప్రాణాలు పోగొట్టుకుంటున్నాయి. విద్యుత్ తీగలు ఏర్పాటు చేసిన విషయం తెలియని కొందరు ప్రజలు సైతం ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ విధంగా గోకవరం మండలంలో జగన్నాథపురానికి చెందిన ఓ వ్యక్తి శివరామపట్నంలోని అటవీ ప్రాంతంలో వన్యప్రాణుల కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలకు తగులుకుని మృత్యువాతపడగా, మల్లవరం అటవీ ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తి వేటగాళ్ల ఉచ్చుకు బలయ్యాడు. దీంతో అటవీ ప్రాంతంలో నిత్యం విధులు నిర్వహించే అటవీశాఖ సిబ్బంది తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. గతంలో సూదికొండ అటవీ ప్రాంతంలో విద్యుత్ ఉచ్చులు ఏర్పాటు చేసినందుకు ఒక వ్యక్తిని, విద్యుత్ ఉచ్చు ద్వారా అడవి జంతువులను వేటాడిని ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి, కొండ గొర్రె, చుక్కల దుప్పి చర్మాన్ని, కొండ అలుగు చిప్పలను అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వన్యప్రాణులను వేటాడితే మూడు సంవత్సరాలు కఠిన కారాగార శిక్ష పడుతుందని, శిక్ష అనుభవించిన తరువాత మళ్లీ మూగజీవాలను వేటాడితే ఈ శిక్ష మరింత ఎక్కువగా ఉంటుందని ఫోక్సుపేట రేంజ్ అధికారి పి.శ్రీనివాస్‌రావు తెలిపారు.

మేకలు, గొర్రెలు మృత్యువాత



మాది రంపయర్రంపాలెం గ్రామం. మేకలు, గొర్రెలను పెంచుకుని జీవనం సాగిస్తున్నాను. ప్రతిరోజు వీటిని సమీపంలోని సూరంపాలెం కాలువ వద్దకు మేతకు తీసుకువెళుతుంటాను. కొందరు వేటగాళ్లు కాలువ సమీపంలోని తోటల్లో వన్యప్రాణుల కోసం ఉచ్చులు వేశారు. వీటి వలన గత వారం రోజులుగా ఐదు మేకలు, రెండు గొర్రెలు చనిపోయాయి. ఉచ్చుల వలన పశువులతో పాటు మనుషుల ప్రాణాలకు కూడా ముప్పు ఉంది. అటవీశాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– కండిపిల్లి చంద్రరావు, రంపయర్రంపాలెం

మోసం చేయడంలో చంద్రబాబు దిట్ట

వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు



కిర్లంపూడి: ఆచరణ సాధ్యంకాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేయడంలో చంద్రబాబు దిట్ట అని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. ఈ మేరకు కిర్లంపూడిలో బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఓటమి భయంతో ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ పేరుతో ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపించి నేడు నిస్సిగ్గుగా హామీలను అమలు చేయాల్సిన అవసరమే లేదన్నట్టు చెబున్నారని ధ్వజమెత్తారు. నాడు ఇచ్చిన నవరత్నాలను 100 శాతం అమలు చేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. లాక్‌డౌన్‌తో ప్రభుత్వానికి ఆదాయం లేకున్నా, పథకాలను ఆపలేదని గుర్తు చేశారు. నేడు ఆదాయం లేదనే సాకుతో పేదలకు అందాల్సిన సంక్షేమ పథకాలను ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికి తల్లికి వందనం పథకం కింద రూ.15 వేల చొప్పున ఇస్తామన్న డబ్బులు ఎప్పుడు వస్తాయా ? అని పేదలు ఎదురు చూస్తున్నారన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, నెలకు ప్రతి మహిళకు రూ.1500, రైతులకు ఏటా పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు, నెలకు రూ.3 వేల చొప్పున నిరుద్యోగ భృతి తదితర హామీలు ఏమయ్యాయన్నారు. సంపద సృష్టి అంటే నిత్యావసరాల ధరలు పెంచడం, విద్యుత్ చార్జీలు, రిజిస్ట్రేషన్ చార్జీలతో ప్రజలను పీడించడమా ? అని ప్రశ్నించారు.

క్రికెట్ టోర్నమెంట్ విజేత పాల్మాన్‌పేట జట్టు


విజేత పాల్మాన్‌పేట జట్టుకు బహుమతులు అందజేస్తున్న అరబిందో సంస్థ జీఎం సుధాకర్

తొండంగి: మండలంలోని పెరుమాళ్లపురం పంచాయతీ తలపంటిపేట గ్రామ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ విజేతగా అనకాపల్లి జిల్లా పాల్మాన్‌పేట జట్టు నిలిచింది. సంక్రాంతి, గణతంత్ర దినోత్సవాలను పురస్కరించుకుని అరబిందో ఇన్‌ఫ్రా–కాకినాడ సెజ్ సహకారంతో తలపంటిపేట యూత్ ఆధ్వర్యంలో ఈ నెల 8 నుంచి ఈ క్రికెట్ టోర్నీ నిర్వహిస్తున్నారు. రెండు జిల్లాల్లో ఆరు నియోజకవర్గాల నుంచి మొత్తం 80 జట్లు పాల్గొన్నాయి. బుధవారం నిర్వహించిన ఫైనల్స్‌లో తొండంగి మండలం ఎల్లయ్యపేట జట్టు, అనకాపల్లి జిల్లా పాల్మాన్‌పేట జట్టు హోరాహోరీగా తలపడగా పాల్మాన్‌పేట జట్టు గెలిచి ట్రోఫీని సొంతం చేసుకుంది. రన్నర్స్‌గా ఎల్లయ్యపేట జట్టు నిలవగా తృతీయస్థానంలో తలపంటిపేట జట్టు నిలిచింది. విజేతలకు అరబిందో ఇన్‌ఫ్రా సంస్థ జనరల్ మేనేజర్ ధర్మవరం సుధాకర్ బహుమతులు అందజేశారు. సంస్థ ప్రతినిధులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రత్తిపాడు: ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రత్తిపాడు సీఐ బి.సూర్య అప్పారావు సూచించారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి వ్యక్తిగత వివరాలు, ఓటీపీ అడిగితే తెలపరాదన్నారు. ప్రజలు వేరే ఊళ్లకు వెళ్లే సమయంలో ఇంటిలోని విలువైన బంగారు ఆభరణాలను బ్యాంకు లాకర్లలో గాని, బంధువుల వద్ద కానీ భద్రపరచుకోవాలన్నారు. ప్రజలు తమ నివాస భవనాలు, వ్యాపార సముదాయాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రజలకు పోలీస్ సహాయం అవసరమైతే స్థానిక సర్కిల్ పరిధిలోని సీఐ 94407 96530, ప్రత్తిపాడు ఎస్సై 94407 96570, అన్నవరం ఎస్సై 94407 96571, ఏలేశ్వరం ఎస్సై 94409 04835, రౌతులపూడి ఎస్సై 94407 96552 నంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉంటాం

గండేపల్లి: స్థానిక పోలీస్ సర్కిల్ పరిధిలోని ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని గండేపల్లి సీఐ వైఆర్కే శ్రీనివాస్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గండేపల్లి, జగ్గంపేట, కిర్లంపూడి మండలాల్లో ప్రజలకు నిరంతరం సేవలందించేందుకు సిద్ధంగా ఉంటామన్నారు. ప్రజలకు ఏదైనా సహాయం అవసరమైతే గండేపల్లి సీఐ 94407 96529, గండేపల్లి ఎస్సై 94409 04841, జగ్గంపేట ఎస్సై 94407 96569, కిర్లంపూడి ఎస్సై 9440904834 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

అవినీతి ఆరోపణలపై విచారణ


గోకవరం ఉపాధి కార్యాలయంలో విచారణ నిర్వహిస్తున్న అంబుడ్స్‌మెన్ ఖాదర్ బాషా

గోకవరం: గ్రామంలో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ఏపీఓ శేషఅప్పలరాజు అవినీతి ఆరోపణలు చేశారంటూ అందిన ఫిర్యాదు మేరకు బుధవారం జిల్లా అంబుడ్స్‌మెన్ ఖాదర్‌బాషా విచారణ నిర్వహించారు. మండలంలోని వెదురుపాకలో ఉపాధి హామీ తనిఖీలో రూ.7.5 లక్షలు అవకతవకలు జరిగాయని వెదురుపాక ఫీల్డ్ అసిస్టెంట్ బుల్లబ్బాయిని ఇటీవల సస్పెండ్ చేశారు. కాగా తనను ఏపీఓ డబ్బులు డిమాండ్ చేశారని, పలుమార్లు ఏపీఓకు డబ్బులు ఇచ్చానని దీనిపై ఎనిమిది మంది గ్రామస్తులు సంతకాలు చేసిన లెటర్లను జత చేసి ఫిర్యాదు చేశాడు. ఈ ఆరోపణలపై అంబుడ్స్‌మెన్ అధికారి కార్యాలయంలో విచారణ నిర్వహించారు. విచారణ అనంతరం ఆయన మాట్లాడుతూ సస్పెండ్ అయిన ఫీల్డ్ అసిస్టెంట్ నుంచి ఏపీఓకు 2020 నుంచి 2024 వరకు డిజిటల్ చెల్లింపులు రూ.3.81 లక్షలు లావాదేవీలు జరిగినట్టు విచారణలో గుర్తించామన్నారు. ఫిర్యాదులో ఎనిమిది గ్రామస్తులు ఇచ్చిన లెటర్లలో ఇద్దరు మాత్రమే హాజరయ్యారన్నారు. హాజరైన ఇద్దరిని విచారించామని, వీటిపై సరైన ఆధారాలు లేవన్నారు. మధ్యాహ్నం భోజనం అనంతరం ఫిర్యాదుదారుడు గైర్హాజరవ్వడంతో ఫిర్యాదుదారునికి నాలుగురోజులు సమయమిస్తూ విచారణను వాయిదా వేసినట్టు అంబుడ్స్‌మెన్ ఖాదర్ బాషా తెలిపారు.

ఆరోగ్య సూత్రాలు పాటించాలి

శంఖవరం: ఉద్యోగ బాధ్యతతో పాటు ఆరోగ్య సూత్రాలు తప్పకుండా పాటించాలని ఎంపీడీఓ ఎస్ఎస్ శర్మ సచివాలయ సిబ్బందికి సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం నిజాం మెడికల్ అండ్ సైన్స్ కళాశాల వైద్యుడు రమేష్ ఆధ్వర్యంలో ఫిజియోథెరపీపై సచివాలయ సిబ్బందికి అవగాహన కల్పించారు. పని ఒత్తిడిలో పడి చాలా మంది ఉద్యోగులు ఆరోగ్యాన్ని పట్టించుకోవడం లేదన్నారు. ఉదయం ప్రతిఒక్కరూ వ్యాయామం చేయాలని సూచించారు.

జాగ్రత్తలు పాటించాలి

గండేపల్లి: వారసత్వ ఆస్తులు కొనుగోలులో జాగ్రత్తలు పాటించాలని పెద్దాపురం ఏడవ అడిషనల్ కోర్టు జిల్లా న్యాయమూర్తి జస్టిస్ జి.చాముండేశ్వరి సూచించారు. స్థానిక మహిళా సమాఖ్య భవనంలో బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ వారసత్వ ఆస్తి మార్పిడి పత్రాలు క్రమ పద్ధతిలో ఆన్‌లైన్ చేసుకుంటే కోర్టులో సివిల్ తగాదాలు సులభంగా పరిష్కారమవుతాయన్నారు. మహిళలు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. బాల్య వివాహాల నివారణ చట్టం, వరకట్న నిరోధక చట్టం, లోక్ అదాలత్, లింగ నిర్ధారణ వ్యతిరేక చట్టంపై న్యాయ వాదులు ఎ.ప్రభుజీ, ఎం.రాంబాబు, ఎస్.దుర్గారావు, ఎస్ విశాలాక్షి అవగాహన కల్పించారు. స్థానిక సీఐ వైఆర్కే శ్రీనివాస్, ఐసీడీఎస్ సీడీపీఓ ఎం.పూర్ణిమ, ఎంపీడీఓ నాతి బుజ్జి, తహసీల్దార్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని వాకపల్లిలో బాధిత కుటుంబాన్ని ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్, వైఎస్సార్ సీపీ నేత ముదునూరి మురళీకృష్ణంరాజు బుధవారం పరామర్శించారు. గ్రామానికి చెందిన ముడదా దేవుడు చేతికి ఆపరేషన్ చేయించుకోగా మురళీరాజు పరామర్శించి రూ.ఐదు వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో బర్ల గోవింద్, వైస్ సర్పంచ్ అవ్వా ఆదినారాయణ, జిల్లా యాదవ సంఘం ఉపాధ్యక్షుడు మడబాల బాబి, కిల్లాడి శివ, గొర్ల కుశరాజు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

గండేపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల సర్వ సభ్య సాధారణ సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ నాతి బుజ్జి బుధవారం తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని సూచించారు.

సమగ్ర వ్యవసాయ విధానంతో రైతులకు మేలు

- జిల్లా వ్యవసాయాధికారి విజయ్‌కుమార్
- పలు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాలు

శంఖవరం: సమగ్ర వ్యవసాయ విధానంతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని జిల్లా వ్యవసాయాధికారి ఎన్.విజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని కత్తిపూడి, సీతంపేట గ్రామాల్లో ఏఓ పి.గాంధీ ఆధ్వర్యంలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. రైతులకు సమగ్ర వ్యవసాయ విధానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి విజయ్‌కుమార్ మాట్లాడుతూ రైతులు ఒకే పంట మీద ఆధారపడకుండా బహుళ పంటల సాగుపై దృష్టి సారించాలన్నారు. ప్రకృతి సాగు చేసి కషాయాలు వాడడం ద్వారా అధిక లాభాలు సాధించవచ్చన్నారు. వ్యవసాయంలో డ్రోన్ల అవశ్యకత, రాయితీలు తదితర అంశాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది రామలక్ష్మి, ప్రభాష్, చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి

కిర్లంపూడి: రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని జిల్లా వ్యవసాయాధికారి ఎన్. విజయ్ కుమార్ సూచించారు. మండల పరిధి సింహాద్రిపురంలో ఏఓ జోకా అమృత అధ్యక్షతన జాతీయ ఆహార భద్రత మిషన్ పథకంలో భాగంగా బుధవారం రైతులకు ప్రకృతి సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఆర్థికంగా ఎదిగేందుకు పంట మార్పిడిని ప్రోత్సహిస్తూ 50 శాతం సబ్సిడీపై ప్రభుత్వాలు పురుగు మందులు అందిస్తున్నట్టు తెలిపారు. తొలిత రైతులతో కలిసి అపరాల పంటలను పరిశీలించారు. ఏఈఏ సురేష్, వీఏఏలు రామకృష్ణ, సునీత తదితరులు ఉన్నారు.


తేటగుంటలో రైతులకు మామిడి పూత, పిందెలు సంరక్షణపై అవగాహన కల్పిస్తున్న హెచ్ఓ, ఏఓలు

తెగుళ్లు, పురుగుల నివారణతో నాణ్యమైన దిగుబడులు

తుని రూరల్: ఉద్యాన, వ్యవసాయ పంటలను ఆశించే తెగుళ్లు, పురుగులను సకాలంలో గుర్తించి నివారిస్తే నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని ఏఓ బి.అశోక్ కుమార్, హెచ్ఓ అరుణ్ కుమార్ అన్నారు. బుధవారం ఉద్యాన, వ్యవసాయశాఖల ఆధ్వర్యంలో తేటగుంట, టి.తిమ్మాపురం గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఓ మాట్లాడుతూ మామిడిలో పూత, పిందెలను సంరక్షించుకోవాలన్నారు. తెగుళ్లు, పురుగులు ఆశించకుండా తగిన మోతాదులో మందులను సకాలంలో పిచికారీ చేయాలన్నారు. నాణ్యతగల మామిడి దిగుబడులకు బహిరంగా మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందన్నారు. మాజీ సర్పంచ్ గజ్జి అప్పలరాజు, చామంతి సత్తిబాబు, ఏఈఓ పి.జగ్గ అప్పారావు, వీఏఏలు భవానీ, సత్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.

అపరాల రైతులకు తోడ్పాటు

ప్రత్తిపాడు రూరల్: అపరాల రైతులకు ప్రభుత్వం తోడ్పాటును అందిస్తోందని జిల్లా వ్యవసాయ అధికారి విజయకుమార్ అన్నారు. మండలంలోని బవురువాకలో అపరాల సామూహిక ప్రదర్శన క్షేత్రాలను బుధవారం ఆయన సందర్శించారు.

ఎరువులు, పురుగుమందుల యాజమాన్యం కీలకం


సింహాద్రిపురంలో అపరాల పంటలను పరిశీలిస్తున్న అధికారులు


పాతకొట్టాంలో రెతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ చంద్రశేఖర్

కోటనందూరు: అపరాల సాగులో ఎరువులు, పురుగుమందుల యాజమాన్యం కీలకమని మండల వ్యవసాయాధికారి కేజే చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని పాతకొట్టాంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ చంద్రశేఖర్ మాట్లాడుతూ నేల స్వభావాన్ని బట్టి పంట ఎదుగుదల ఉంటుందన్నారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు, పురుగుమందులు వినియోగిస్తే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. డ్రోన్ స్ప్రేయర్లతో కలిగే ప్రయోజనం, వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం అపరాల పంటను పరిశీలించి ఎరువులు, పురుగుమందుల యాజమాన్యంపై రైతులకు అవగాహన కల్పించారు. ఏఈఓ కేవీ శివకుమారి, వీహెచ్ఏ జీ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తుని రూరల్: తాండవ విద్యుత్ **సబ్‌స్టేషన్** పరిధిలో లైన్ల నిర్వహణ కారణంగా **శుక్రవారం** విద్యుత్ సరఫరాకు అంతరాయం **కలుగుతుం**దని ట్రాన్స్‌కో జగ్గంపేట ఈఈ **బి.వీరభద్ర**రావు బుధవారం ఓ ప్రకటనలో **తెలిపారు.** తుని పట్టణంలోని డీమార్ట్, కొండవారపేట, టైలర్స్ కాలనీ, కంకిపాటి గరువు, అమ్మాజీపేట, సీతారాంపురం, ట్రావెలర్స్ బంగ్లా ప్రాంతాల్లో ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటలు వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ అంతరాయానికి ప్రజలు సహకరించాలని కోరారు.

ఆత్మార్పణ వేడుకలను విజయవంతం చేయాలి

గండేపల్లి: పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండ వాసవి మాత ఆలయంలో శుక్రవారం నిర్వహించే ఆత్మార్పణ వేడుకలకు ఆర్యవైశ్యులు తరలివచ్చి విజయవంతం చేయాలని రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త కొండబాబు పిలుపునిచ్చారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఆర్యవైశ్యుల ఇలవేల్పు వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని అధికారంగా నిర్వహించేందుకు 181 జీవో విడుదల చేసిన ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అలాగే జగ్గంపేటలోని వాసవి మాత ఆలయంలోనూ వేడుకలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

తాటాకిల్లు దగ్ధం

కోటనందూరు: మండలంలోని భీమవరపుకోటలో బుధవారం తాటాకిల్లు దగ్ధమైంది. ఈ ప్రమాదంలో రూ.2.5 లక్షల ఆస్తినష్టం వాటిల్లింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన బీజా సంహాచలం తుని మండలం హంసవరంలో ఓ ఫ్యాక్టరీలో పని చేస్తోంది. రోజూ మాదిరిగానే బుధవారం సింహాచలం పనికి వెళ్లిన సమయంలో తన తాటాకింటికి నిప్పంటుకుంది. ఈ ప్రమాదంలో ఇంట్లో ఉన్న రూ. 63 వేల నగదు, రెండున్నర తులాల బంగారం, భూమి డాక్యుమెంట్లు, టీవీ, ఇంట్లో వస్తువులు కాలి బూడిదయ్యాయి. తుని ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేశారు. సర్పంచ్ జిగటాల వీరబాబు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

రూ.13 కోట్లతో కాలువల అభివృద్ధికి ప్రతిపాదనలు

కోటనందూరు: తాండవ ప్రాజెక్టు పరిధిలో శిథిలమైన కాలువలు, కల్వర్టుల అభివృద్ధికి రూ.13 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు ప్రాజెక్టు ఈఈ బాల్యసూర్యం బుధవారం తెలిపారు. కాకరాపల్లి, కోటనందూరు, అల్లిపూడి, భీమవరపుకోట, అప్పలరాజుపేట గ్రామాల్లోని మేజర్, మైనర్ కాలువలు, శిథిలమైన కల్వర్టులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చిన వెంటనే కాలువ పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. వచ్చే ఖరీఫ్ నాటికి ఆయకట్టు రైతులకు ఇబ్బంది లేకుండా నీరందిస్తామన్నారు. కార్యక్రమంలో తాండవ ప్రాజెక్టు చైర్మన్ కరక సత్యనారాయణ, వైస్ చైర్మన్ మేడపురెడ్డి జోగిబాబు, డీఈఈ అనురాధ, జేఈఈడి రవికుమార్, దుర్గబాబు, శ్యాంకుమార్, వర్క్ఇనస్పెక్టర్ నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ శ్రీలతకు సత్కారం


సర్పంచ్ శ్రీలత దంపతులను సత్కరిస్తున్న దళిత నాయకులు

కిర్లంపూడి: జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ (దిశ) సభ్యురాలిగా నియమితులైన జగపతినగరం సర్పంచ్ మహేంద్రాడ శ్రీలతను నియోజకవర్గంలోని దళితగళం సభ్యులు బుధవారం ఘనంగా సత్కరించారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో నియోజకవర్గంలోని కిర్లంపూడి, జగ్గంపేట, గోకవరం, గండేపల్లి మండలాలకు చెందిన దళిత నాయకులు సత్కార సభను ఏర్పాటు చేశారు. సర్పంచ్ శ్రీలత దంపతులను పూలమాల, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు ఈది ఆశోక్, బత్తిన స్వామి, ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు పురం హరీష్, పెదపాటి శుభాకర్, మూరా సత్తిబాబు, మోర్త చట్టిబాబు, తుమ్మల కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్లు అప్రమత్తంగా వ్యవహరించాలి

ప్రత్తిపాడు: వాహనాలు నడిపే సమయంలో డ్రైవర్లు అప్రమత్తంగా వ్యవహరించాలని ప్రత్తిపాడు సీఐ బి.సూర్య అప్పారావు సూచించారు. రోడ్డుపై ప్రయాణించినపుడు వాహన చోదకులే కాదు పాదచారులు కూడా జాగ్రత్తగా ఉండాలన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా స్థానిక మార్కెట్ వద్ద నందిబొమ్మ జంక్షన్‌లో బుధవారం సాయంత్రం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ బి.సూర్య అప్పారావు మాట్లాడుతూ వాహన చోదకులు హెల్మెట్, సీటు బెల్టు ధరించాలన్నారు. రోడ్డు భద్రతా నియమాలను వివరించారు. ఎస్సై ఎస్.లక్ష్మీకాంతం, ఎన్‌హెచ్ మెయింటినెన్స్ యార్డు మేనేజర్ రవికుమార్, సేఫ్టీ మేనేజర్ అశోక్‌కుమార్, షేక్ షాన్ బాషా తదితరులు పాల్గొన్నారు.

భూముల రీ సర్వే పరిశీలన


ఆర్.వెంకటాపురంలో రీ సర్వే రికార్డులు పరిశీలిస్తున్న జేసీ రాహుల్ మీనా

రౌతులపూడి: మండలంలోని రాజవరం శివారు ఆర్.వెంకటాపురంలో జరుగుతున్న భూముల రీ–సర్వే పనులను జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా బుధవారం పరిశీలించారు. భూముల సరిహద్దు, ప్రభుత్వ భూముల సరిహద్దు నిర్ణయించడం, గ్రౌండ్ ట్రూతింగ్ పనులను ఆయన తనిఖీ చేశారు. రాజవరం సచివాలయంలో రీ సర్వే సిబ్బందితో సమీక్షించారు. గ్రామాల్లో రీ సర్వే చేసే రైతులకు ముందుగా నోటీసులు ఇవ్వాలన్నారు. ఇప్పటివరకు ఎంత శాతం సర్వే నిర్వహించారో తెలుసుకుని మిగిలి ఉన్న సర్వేపై సిబ్బందిని ఆరా తీశారు. త్వరితగతిన సర్వే పూర్తి చేసి నివేదిక అందజేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్వీ నరేష్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే పెద్దాపురం పీవీకేఎస్ ప్రసాద్, మండల సర్వేయర్ రాజశేఖరరావు, వీఆర్‌ఓ కె.గోవింద్‌కుమార్, విలేజ్ సర్వేయర్లు ఎల్.శివ, ఎల్.కుశరాజు, ఆర్.నాగేంద్ర, కె.కేశవరావు పాల్గొన్నారు.

పశువుల సంరక్షణకు చర్యలు తీసుకోవాలి

ఏలేశ్వరం: పశువుల సంరక్షణకు రైతులు చర్యలు తీసుకోవాలని పశుసంవర్ధక శాఖ సహాయకురాలు కె.అనిత సూచించారు. మండలంలోని సిరిపురంలో బుధవారం పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పశుసంరక్షణపై రైతులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. పశువులకు నట్టల నివారణ టీకాలు వేయించాలన్నారు. అనంతరం ఏడాదిలోపు పశువులకు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో రైతులు ఇజ్జన శేషారావు, మజ్జూరి ఈశ్వరుడు, మజ్జూరి వెంకటరమణలు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందారు. అనంతరం రైతులకు సర్పంచ్ పీతల సూకరాజు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పశువైద్యులు వరలక్ష్మి, సతీష్, మంజూష, వెంకటేష్, రైతులు పాల్గొన్నారు.

పశు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

జగ్గంపేట: పశువుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని జిల్లా పశు వైద్యాధికారి సూర్య ప్రకాష్ పిలుపునిచ్చారు. మండలంలోని మన్యవారిపాలెంలో బుధవారం పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని టీడీపీ జిల్లా అధ్యక్షుడు నవీన్ కుమార్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. డాక్టర్లు పశువులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు.

ఆసుపత్రి అభివృద్ధిపై దృష్టి సారించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ

రౌతులపూడి: స్థానిక సీహెచ్‌సీ అభివృద్ధిపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులకు సూచించారు. ఆసుపత్రి ఆవరణలో బుధవారం సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ జానకీదేవి ఆధ్వర్యంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆసుపత్రికి వస్తున్న రోగులకు మెరుగైన సేవలందించేందుకు మరిన్ని పడకలను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానన్నారు. ఆసుపత్రి అభివృద్ధి నూతన కమిటీ సభ్యులు రెడ్డి చిన్నయ్యనాయుడు, బండారు సత్యనారాయణ, అంబటి లక్ష్మిలను ఆమె అభినందించారు. కార్యక్రమంలో వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ పైల సాంబశివరావు, సర్పంచ్ కె.అర్జునమ్మ, ఉప సర్పంచ్ వాసిరెడ్డి భాస్కరబాబు, మాజీ ఎంపీపీ ఇటంశెట్టి సూర్యభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

గిడజాంలో కొండచిలువ హతం


స్థానికులు హతమార్చిన 15 అడుగుల కొండ చిలువ

రౌతులపూడి: గిడజాంలో ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం 15 అడుగుల కొండ చిలువను స్థానికులు హతమార్చారు. కొండ ప్రాంతంలోంచి కొండ చిలువ పాఠశాల ఆవరణలోకి ప్రవేశించింది. కొండచిలువను చూసి భయాందోళనకు గురైన విద్యార్థులు స్థానికులకు సమాచారం ఇచ్చారు. కాగా గడ్డిలో దాగి ఉన్న కొండచిలువను స్థానికులు గుర్తించి అక్కడికక్కడే హతమార్చారు. దీంతో విద్యార్థులు, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

జాతీయ రహదారిపై హల్‌చల్

గండేపల్లి: జాతీయ రహదారిపై హల్‌చల్ చేసిన కొండ చిలువ అంతలోనే ప్రమాదానికి గురై మృత్యువాత పడింది. మండలంలోని మల్లేపల్లి శివారు పుష్కర, పోలవరం కాలువ గట్టు పొలాల నుంచి బుధవారం రాత్రి రోడ్డెక్కిన కొండ చిలువ బ్రిడ్జిపైకి చేరుకుంది. రాజమహేంద్రవరం వైపు నుంచి జగ్గంపేట వైపు వెళ్లే మార్గంలో రోడ్డు దాటే ప్రయత్నంలో ప్రయాణికుల కంట పడటంతో ద్విచక్రవాహనదారులు భయభ్రాంతులకు గురై వాహనాలు నిలిపివేశారు. కాగా రోడ్డు దాటే క్రమంలో లారీ చక్రాల కింద పడి నుజ్జునుజ్జయ్యింది.